క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శైలజారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు ఎంపీపీ వసంత అధ్యక్షతన జరిగే సమీక్షకు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల, డివిజన్ స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

బంట్వారం: ఈ నెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమీక్ష ప్రారంభం అవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

వైన్స్ ఓపెన్‌పై ఆగ్రహం

ధారూరు: నిమజ్జనోత్సవం రోజున వైన్ షాపులను ఎందుకు బంద్ చేయలేదంటూ పలువురు భక్తులు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. మద్యం దుకాణాలు తెరిచే ఉండటంతో మందుబాబులు క్యూకట్టడాన్ని చూసిన ఉత్సవ నిర్వాహకులు మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా ఇంతకు మద్యం దుకాణాలకు బంద్ వర్తించేదని, ఇప్పుడు తెరిచే ఉండటంతో.. గణేశ్‌ల ఊరేగింపులో చాలామంది మద్యం తాగి చిందులేయడంతో భక్తులు ఇబ్బందులకు గురయ్యారని వాపోయారు.

తాండూరులో కాంగ్రెస్ గెలుపు ఖాయం

తాండూరు రూరల్: కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉందని ఆ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు నాగప్పతో కలిసి మండల పరిధి జినుగుర్తి, వీరారెడ్డిపల్లిలో గ్రామ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరులో పార్టీ అభ్యర్థి విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి, అనంతరం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంరెడ్డి, రఘు కిషోర్, అజ్మత్, అశోక్‌కుమార్, జగదీష్ ఉన్నారు.

ఆర్థిక సహాయం

బొంరాస్‌పేట: అనారోగ్యంతో మృతిచెందిన బాల్య స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు ఆ మిత్రులు. మండల పరిధి తుంకిమెట్లకు చెందిన బల్ల శ్రీనివాస్‌గౌడ్‌తో 1998–99లో కలిసి పదోతరగతి చదువుకున్న బాల్యమిత్రులు శుక్రవారం రూ.21,500 సాయం అందజేశారు. కుటుంబానికి భరోసా కల్పించారు.


బీసీ మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కొడంగల్ రూరల్: మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ పొలిటికల్ జేఏసీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పులిందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యార్థులతో అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాల మహిళలకు ఈ మహిళా బిల్లులో ప్రాధాన్యత లేదని, జనాభా దామాష ప్రకారం వివిధ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించినప్పుడే మహిళా బిల్లు ఉపయోగపడుతుందన్నారు. అట్టడుగు వారికి ప్రాధాన్యత కల్పించేలా బిల్లును సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నియోజకవర్గ నాయకుడు భీమరాజు, విద్యార్థి సంఘం సభ్యులు స్రవంతి, విజయలక్ష్మి, సంధ్య, స్వప్న, అక్షయ సునీత, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లోకి 'బహుజన సిద్ధాంతం'

దౌల్తాబాద్: బహుజన సమాజ్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద కిష్టప్ప అన్నారు. శుక్రవారం బిచ్చాల గ్రామంలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా బహుజనులను చైతన్యవంతం చేస్తూ రాజ్యాధికారం సాధించడానికి ఎందరో నాయకులు తమ జీవితాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రతి పల్లెకు బహుజన సిద్ధాంతాన్ని తీసుకెళ్లి పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాల పట్ల ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు చాకలి వెంకటప్ప, పురుషోత్తం, మాణిక్యప్ప, రవి, అశోక్ పాల్గొన్నారు.

సేవాభావం ఉంటేనే అభివృద్ధి



గ్యాస్ బండ, స్టౌవ్ అందజేస్తున్న పెంటయ్య

పూడూరు: సేవాభావం ఉంటేనే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటయ్య అన్నారు. శుక్రవారం తిర్మలాపూర్‌లో పలువురికి గ్యాస్ కనెక్షన్, స్టౌవ్‌లు అందజేసి మాట్లాడారు. ఎక్కడ ఎవరికి ఏ ఆపద, అవసరం వచ్చినా తాను ముందుంటానని తెలిపారు. ఇందులో నాయకులు రాములునాయక్, సాయన్న, పరశురాం, రమేష్ ఉన్నారు.

తెరపైకి బీసీ ఉద్యమం

- చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్
- పార్టీలకతీతంగా ఒకే వేదికపైకి నేతలు
- మహిళా బిల్లులో బీసీలకు రిజర్వేషన్ లేకపోవడంపై ఆగ్రహం
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత
- ఉద్యమ కార్యాచరణ ప్రారంభిస్తున్నట్లు ప్రకటన



వికారాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్యమ కార్యాచరణను ప్రారంభిస్తున్న బీసీ నేతలు

వికారాబాద్: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్టీలకతీతంగా బీసీ నేతలు ఒకే వేదికపైకి వచ్చారు. గ్రామస్థాయి నుంచి ఢిల్లీస్థాయి వరకు తమ వాణి వినిపించేలా ఉద్యమ కార్యచరణ రూపొందించారు. చట్టసభల్లో మహిళా బిల్లు ఆమోదించడం, అందులో జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్టీలకతీతంగా జిల్లాకు చెందిన బీసీ నేతలు శుక్రవారం వికారాబాద్‌లో సమావేశమయ్యారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ఉద్యమ కార్యాచరణను ప్రారంభించారు. బీసీల గొంతు గల్లీ నుంచి ఢిల్లీకి చేరేలా ఉద్యమిద్దామని తీర్మానించారు. పార్లమెంట్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మహిళా బిల్లు తరహాలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాలకు చెందిన బీసీ నేతలు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ ప్రారంభం

బీసీ రిజర్వేషన్ సాధనే లక్ష్యంగా జిల్లా హడక్ కమిటీని ఏర్పాటు చేశారు. వారం రోజుల్లో నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ముందుగా నియోజకవర్గ స్థాయిలో ర్యాలీలు, రస్తారోకోలు, నిరసనలు, నిరాహార దీక్షలు చేపట్టాలని తీర్మానించారు. బీసీ భావజాలవ్యాప్తి, ఉద్యమ సన్నద్ధత, జన సమీకరణ, అన్ని బీసీ కులాల ఐక్యత కోసం తరచూ రౌండ్ టేబుల్ సమావేశాలు, సమీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం బీసీలకు జరుగుతున్న అన్యాయం, అణచివేత గురించి చర్చించారు.

ఉద్యమం ఆగదు

జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి. ఇందుకు సంబంధించిన బిల్లును చట్టసభల్లో ప్రవేశ పెట్టి ఆమోదించాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం ఆగదు. బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వని పార్టీలన్నీ బీసీ వ్యతిరేకులుగానే చూస్తాం. గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని నిర్మిస్తాం.

– లాల్‌కృష్ణ ప్రసాద్, బీసీ నేత

బీసీ వ్యతిరేకులెవరో తేలాలి

మెజార్టీ సామాజిక వర్గం అయిన బీసీల ఓట్ల కోసం అన్ని రాజకీయ పార్టీలు బీసీ భజన చేస్తాయి. సీట్ల కేటాయింపులో మాత్రం అన్ని పార్టీలదీ ఒకే దారి. బీసీ బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెడితేనే బీసీలకు మిత్రులెవరో, శత్రువులు ఎవరో తేలుతుంది. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం.

– హన్మంతు ముదిరాజ్, బీసీ నేత

అందరూ కలిసిరావాలి

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషనే లక్ష్యంగా ఉద్యమం చేస్తాం. బీసీ సామాజిక వర్గంలో ఉన్న అన్ని కులాలను కలుపుకొని వెళతాం. బీసీలు ఉద్యమంలో పాల్గొనడంతోపాటు పూర్తి సహకారం అందించాలి. అన్ని పార్టీల్లోని బీసీ నేతలు, బీసీ ఉద్యోగులు, బీసీ రైతు సంఘాల, బీసీ కుల సంఘాలు పాల్గొనాలి.

– నాగేందర్‌గౌడ్, బీసీ నేత

అర్హులు లేబర్‌కార్డు పొందాలి



అవగాహన కల్పిస్తున్న ప్రకాష్ కుమార్

కుల్కచర్ల: అర్హులైన ప్రతి ఒక్కరూ లేబర్‌కార్డు పొందాలని జన్‌సహస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కూలీలు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ కార్డును పొందేందుకు అర్హులని చెప్పారు. అంతే కాకుండా వివిధ పనుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు లేబర్ పథకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇంటివద్దే దరఖాస్తులు స్వీకరించి, అక్కడే కార్డులు అందజేస్తామని వెల్లడించారు. కార్డు ద్వారా జరిగే లబ్ధి ప్రక్రియను సైతం లేబర్ కార్యాలయం నుంచి పొందేందుకు తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్యారెడ్డి, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరి వెంకటేశ్, కృష్ణయ్య, భీమయ్య, చంద్రయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే చేయించి న్యాయం చేయండి



కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత రైతులు

అనంతగిరి: తమ భూములను రీ సర్వే చేయించి న్యాయం చేయాలని పలువురు ఎన్కతల రైతులు కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మోమిన్‌పేట్ మండలం ఎన్కతల గ్రామంలోని సర్వే నంబర్ 174, 198 భూములను తెలంగాణ మొబిలిటీ వ్యాలి కోసం ఇచ్చామని పేర్కొన్నారు. ఇందులో ఎకరా భూమికి రూ.17 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తానని రెవెన్యూ అధికారులు తమకు హామీ ఇచ్చారని తెలిపారు. కానీ.. పట్టా విస్తీర్ణం కంటే తమకు డబ్బులు తక్కువ వేశారని, ఈ విషయంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని ఆరోపించారు. తగిన చర్యలు తీసుకొని, రీ సర్వే చేయించి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

అనంతగిరి: వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం మాజీ మంత్రి ప్రసాద్ కుమార్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, సీనియర్ నాయకులు వేమారెడ్డి, బాలరాజు, అంజయ్య, గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్, జంగయ్య ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• అన్నదానం మహాదానం

దోమ: అన్నదానం మహాదానమని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ వార్డు సభ్యులు అరిషియా, మైనొద్దీన్, సురేశ్ వినాయకుడి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఇందులో ఉపసర్పంచ్ గోపాల్‌గౌడ్, గ్రామస్తులు శ్రీనివాస్, బస్వరాజ్, బాల్‌రాజ్, నర్సింహులు, అహ్మద్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

• పర్యావరణం కాపాడుదాం

బొంరాస్‌పేట: సీడ్‌బాల్స్ విధానంతో పర్యావరణాన్ని కాపాడుదామని తాండూరు శ్రీరామకష్ణ సేవాసమితి సభ్యులు అన్నారు. శుక్రవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలంగిరిజన పాఠశాల విద్యార్థినులు సీడ్‌బాల్స్ విసిరారు. అనంతరం పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్రతినిధులు వెంకటేశ్, టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్ ఉన్నారు.

• నేడు 'సత్యశోధక్' మహోత్సవాలు

కొడంగల్ రూరల్: హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించనున్న 'సత్యశోధక్' 150వ మహోత్సవాల సభను విజయవంతం చేయాలని (ఎల్‌హెచ్‌పీఎస్)లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సూర్యానాయక్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. మహోత్సవానికి విద్యార్థులు, మేధావులు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఇందులో భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా అధ్యక్షుడు అరుణ్‌నాయక్ పాల్గొన్నారు.

• బ్యాంకు లావాదేవీలపై అవగాహన..

దోమ: బ్యాంకు లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వంశీ సూచించారు. దాదాపూర్ బ్యాంకు ఆవరణలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ లావాదేవీలు, సామాజిక భద్రత, ఆన్‌లైన్లో జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. మహిళలకు, రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలను అందిస్తూ ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఇందులో బ్యాంకు ఫీల్డ్ అధికారులు అనిత, ఖాజారెడ్డి, క్యాషియర్ శ్వేత, గుండాల ఉపసర్పంచ్ దేశ్యానాయక్, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

• శాంతియుతంగా...

కొడంగల్ రూరల్: శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సీఐ రాములు సూచించారు. శుక్రవారం ఠాణా కార్యాలయ ఆవరణలో గణేశ్ ఉత్సవ కమిటి సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమజ్జన వేడుకల్లో ఎలాంటి గొడవలకు తావులేకుండా సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

• 'స్వచ్ఛతా హీ సేవ' ర్యాలీ

అనంతగిరి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వికారాబాద్ మండలం కొటాలగూడలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గ్రామంలో తిరుగుతూ నినదించారు. గ్రామాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ర్యాలీలో సర్పంచ్ రాములు నాయక్, ఎంపీఓ నాగరాజు, గ్రామ కార్యదర్శి రాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు నరేందర్, ఊర్మిళ, శాంతాబాయి ఉన్నారు.

• ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మెస్పీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ మల్లికార్జున్, పలువురు జిల్లా నాయకులు ఉన్నారు.

• సాధన పరీక్ష పత్రాల పంపిణీ

బొంరాస్‌పేట: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(ఎన్ఏసీ) సాధన పరీక్ష పత్రాలను శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో పంపిణీ చేశారు. పరీక్ష పత్రాలు, పరీక్షలు రాసే విధానం, ప్రశ్నల విధానం అంశాల పట్ల అవగాహన కల్పించారు.

సమస్యలు తీరేవరకు పోరాటం

- అంగన్‌వాడీల సమ్మెను పట్టించుకోని ప్రభుత్వం
- కలెక్టరేట్ల ముట్టడితో అక్రమ కేసులు పెడుతున్న పోలీసులు
- నిరసన కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు



తాండూరు రూరల్: సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న నాయకులు

తాండూరు రూరల్: సమస్యల సాధనకోసం 12 రోజులుగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, సమస్యలు పరిష్కరించేంత వరకు నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న సమ్మెకు ఆయన శుక్రవారం మద్దతు తెలిపి మాట్లాడారు. కలెక్టరేట్ల ముట్టడి కారణంగా అంగన్‌వాడీలపై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. ఎన్నికేసులు పెట్టినా సమ్మె కొనసాగిస్తామన్నారు. అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయడంతో పాటు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సమ్మెకు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, నారాయణగౌడ్, తిరుపతి, భాను, గోపాల్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి

కొడంగల్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనంతో పాటు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, అంగన్‌వాడీ కొడంగల్ ప్రాజక్టు ప్రధాన కార్యదర్శి నవనీత, ఉపాధ్యక్షురాలు శివలీల, అంగన్‌వాడీ టీచర్లు వినోద, వెంకటమ్మ, హెల్పర్లు సావిత్రి, ఆనందమ్మ, రాములమ్మ, కిష్టమ్మ, జయమ్మ ఉన్నారు.

మోకాళ్లపై కూర్చొని

మోమిన్‌పేట: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం చెల్లించాలిని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వసంత డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన నిరసనలో భాగంగా మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పెరుగుతున్న నిత్యవసరా సరుకులకు అనుగుణంగా కనీస వేతనాలను చెల్లించాలన్నారు. ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు భారతి, రేణుక, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

ఒంటికాలిపై నిరసన

పరిగి: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటామని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. సమ్మెలో భాగంగా ఒంటికాలిపై నిరసన వ్యక్తంచేశారు. అనంతరం మాట్లాడారు. అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు ఉన్నారు.



పరిగిలో.. ఒంటికాలిపై నిరసన



మోమిన్‌పేటలో.. మోకాళ్లపై అంగన్‌వాడీల నిరసన



యాలాలలో గణనాథుడితో చిన్నారి

బైబై వినాయక

చవితి నవరాత్రుల్లో భాగంగా ఐదో రోజైన శుక్రవారం జిల్లాలోని పలుప్రాంతాల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ ఉత్సవంలో పాల్గొని సందడి చేశారు. పలు మండపాల ఎదుట ఉట్లుకొట్టగా.. మరికొన్ని చోట్ల కోలాటం ఆడారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల మండపాల్లో కొలువైన లంబోదరుడి పూజాకార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూర్: వినాయక శోభాయాత్రను పరిశీలిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి



తాండూర్‌లో..



తాండూర్‌లో..



మోమిన్‌పేట: నిమజ్జనం సందర్భంగా కోలాటం వేస్తున్న మహిళలు



దౌల్తాబాద్‌లో..



వికారాబాద్: అనంత రెసిడెన్సీ వినాయకుడి శోభాయాత్ర



కుల్కచర్లలో..



ధారూరు: వినాయకుని ఊరేగింపులో యువకుల నృత్యం



పెద్దేముల్: వేలంలో రూ.22,500కు గణపతి లడ్డూ దక్కించుకున్న రేగొండి సర్పంచ్ హైదర్



పరిగి: గణేశ్ పూజాకార్యక్రమంలో బీజేపీ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి తదితరులు



పూడూరు: చన్గోముల్ పూజలో పాల్గొన్న యువకులు